

**రంజాన్ వేళలు**
ఇఫ్తార్ - శుక్రవారం
సాయంత్రం - 6:35
సహర్ - శనివారం
ఉదయం - 4:50



## ఉమ్మడి జిల్లాలో ఠారెత్తిస్తున్న ఎండలు

- మేడ్చల్ జిల్లాలో రికార్డు స్థాయి ఉష్ణోగ్రత నమోదు
- బాలానగర్‌లో 42.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి) : ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఎండలు హడలెత్తిస్తున్నాయి. గురువారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తొలిసారి ఈ వేసవి సీజన్‌లో ఉమ్మడి జిల్లాలో 42 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడం గమనార్హం. అత్యధికంగా మేడ్చల్ జిల్లా బాలానగర్‌లో 42.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లిలో 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రంగారెడ్డి జిల్లా నాగోల్‌లో 41.7 డిగ్రీలు, మియాపూర్‌లో 41.5, మొయినాబాద్ మండలం చిలుకూరు, షాబాద్‌లలో 41.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లిలో 41.2 డిగ్రీలు, రెడ్డిపల్లిలో 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వికారాబాద్ జిల్లా బంట్వారం మండలం నాగారం, తాండూరు, యాలాల, కులకచర్లలో అత్యధికంగా 40.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రాబోయే రెండు రోజుల పాటు ఎండ తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ మేరకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.



# ఎమ్మెల్సీ ఉప ఎన్నిక.. ప్రశాంతం!

## 99.86 శాతం పోలింగ్ నమోదు

మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి జరిగిన ఉప ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. ఉదయం మందకొడిగా ఓటింగ్ సాగినా.. మధ్యాహ్నం తర్వాత ఊపందుకుంది. ఓటర్లను ఆయా పార్టీలు క్యాంపులకు తీసుకెళ్లడంతో ఉదయం పెద్దగా ఓటింగ్ నమోదు కాలేదు. క్యాంపులకు వెళ్లిన వారు ఒక్కసారిగా బస్సుల్లో తరలివచ్చి ఓటుహక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు చేపట్టారు.

- క్యాంపుల నుంచి బస్సుల్లో పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు
- బీఆర్ఎస్ క్యాంపు నుంచే అత్యధికంగా..
- వారినీ సంప్రదించడంతో క్రాస్ ఓటింగ్‌పై కాంగ్రెస్ ఆశలు
- ఓటేసిన సీఎం రేవంత్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు
- ఏప్రిల్ 2న ఓట్ల లెక్కింపు.. గెలుపుపై అందరిలోనూ ఉత్కంఠ



షాద్‌నగర్‌లో ఓటు వేసేందుకు వచ్చిన మహిళా ప్రజాప్రతినిధులు

షాద్‌నగర్/కొడంగల్/ఆమనగల్లు/మహబూబ్‌నగర్, మార్చి 28 : ఉమ్మడి పాలమూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. మొత్తం పది పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా.. సాయంత్రం 4 గంటలకు ముగిసింది. మొత్తం 1,439 ఓట్లకుగాను 1,437మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. 99.86 శాతంగా పోలింగ్ నమోదైంది. ఉదయం కొంత మందకొడిగా ప్రారంభమైన పోలింగ్.. క్యాంపులకు వెళ్లిన వారి బస్సులు ఒక్కొక్కటిగా రావడంతో 11 గంటల నుంచి 2 గంటల మధ్యలో భారీగా పోలింగ్ జరిగింది. ఆ తర్వాత మిగిలిన ఓటర్లు తమ హక్కును వినియోగించుకున్నారు. మొదటి నుంచీ బీఆర్ఎస్ పార్టీకి స్థానిక సంస్థల్లో బలం ఉండటం.. ఎమ్మెల్సీ అభ్యర్థిగా నవీన్‌కుమార్‌రెడ్డి ఖరారైన వెంటనే క్యాంపు రాజకీయాలకు తెరలేపడం, ఏకంగా ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ సైతం గోవాకు వెళ్లి ప్రజాప్రతినిధులతో గడపటం, అలాగే చాలామంది మంత్రులు, పార్టీలో కీలక వ్యక్తులు ఎప్పటికప్పుడు ఈ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పనిచేయడంతో బీఆర్ఎస్ క్యాంపును కాపాడుకున్నారు. అయితే కాంగ్రెస్ తన బలాన్ని కాపాడుకోవడంతో పాటు నోటిఫికేషన్ విడుదలైన నాటి నుంచే ఆపరేషన్ ఆకర్ష్ చేపట్టింది. ఇబ్బడిముబ్బడిగా పార్టీలో చేర్చుకోవడంతో తమ బలం పెంచుకున్నారు. అలాగే చాలామంది ఎమ్మెల్యేలు క్యాంపులను కూడా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ.. బీఆర్ఎస్ క్యాంపులకు వెళ్లిన వారితో కూడా టచ్‌లో ఉండి వారిని మేనేజ్ చేసుకోవడంతో క్రాస్ ఓటింగ్‌పై కాంగ్రెస్ ఆశలు పెట్టుకుంది. పోరు హోరాహోరీగా సాగడంతో ఎంతవరకు క్రాస్ ఓటింగ్ అయ్యింది? ఎవరికి విజయావకాశాలు ఉంటాయనే విషయంలో ఏప్రిల్ 2వ తేదీన నిర్వహించే ఓట్ల లెక్కింపు తర్వాతనే తేలనుంది. వాస్తవానికి బీఆర్ఎస్‌కు స్థానిక సంస్థల్లో బలం ఎక్కువగా ఉంది. ప్రభుత్వం కూడా బీఆర్ఎస్‌దే ఉంటే.. అసలు కాంగ్రెస్ అభ్యర్థిని నిలపడానికి కూడా కష్టంగా ఉండేది. కానీ గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలవడం వల్ల.. ఆ పార్టీ అభ్యర్థిని పోటీలో నిలిపింది. ఈ నేపథ్యంలోనే అందరిలో గెలుపుపై భారీ ఉత్కంఠ నెలకొంది.




### ఓటు వేసిన 80 ఏళ్ల ఎంపీటీసీ

కొత్తూరు మండలం సిద్ధాపూర్ గ్రామానికి చెందిన 80 ఏళ్ల వయస్సున్న ఎంపీటీసీ సభ్యురాలు పత్లావత్ ఢాకీ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఒంటరిగానే నడుచుకుంటూ వచ్చి ఓటు వేశారు.

### పోలింగ్ సరళి ఇలా...:

ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా.. అన్ని సెంటర్లలోనూ 11 గంటల వరకు తక్కువగానే పోలింగ్ నమోదైంది. క్యాంపులకు వెళ్లిన వారు 11 గంటల తర్వాతనే వరుసగా బస్సుల్లో రావడంతో పోలింగ్ శాతం 2గంటల వరకు భారీగా నమోదైంది. మహబూబ్ నగర్‌లో 245 మందికి ఓటు హక్కు ఉండగా.. మొత్తం అందరూ ఓటు వేయడంతో వందశాతం పోలింగ్ నమోదైంది. కొడంగల్‌లో 56 ఓట్లు ఉండగా అక్కడా పోలింగ్ వంద శాతం అయ్యింది. వనపర్తి, గద్వాల, కొల్లాపూర్, అచ్చంపేట, షాద్‌నగర్, కల్వకుర్తిల్లో కూడా వంద శాతం పోలింగ్ నమోదైంది. నారాయణపేట పోలింగ్ కేంద్రంలో 205 ఓట్లు ఉండగా.. మక్తల్ మండలం మంతన్‌గోడ్ ఎంపీటీసీ సుమిత్ర ఓటు వేయలేదు. అలాగే నాగర్‌కర్నూలు పోలింగ్ కేంద్రంలో 101 ఓట్లు ఉండగా.. 100 ఓట్లు పోల్ అయ్యాయి. ఇక్కడ బిజినేపల్లి మండలం గుడ్లనర్వ ఎంపీటీసీ సభ్యురాలు శారదమ్మ ఓటుహక్కు వినియోగించుకోలేదు. ఆమె రెండు నెలల క్రితం అమెరికా వెళ్లడంతో ఓటు వినియోగించుకోలేకపోయారు. దీంతో పోలింగ్ శాతం 99.86 శాతంగా నమోదైంది. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. మహబూబ్‌నగర్ కలెక్టర్ రవి గుగులోత్ పోలింగ్ సెంటర్ల వద్ద పరిస్థితిని వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలించారు. వివిధ జిల్లాల అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి, ఎనుముల తిరుపతిరెడ్డి పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.



షాద్‌నగర్‌లో ఓటుహక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

### ఎక్స్ అఫీషియో ఓట్లు..

ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్‌లో తన ఓటుహక్కును వినియోగించుకున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు రోడ్డుమార్గం ద్వారా కొడంగల్‌కు చేరుకున్న ఆయన నేరుగా పోలింగ్ కేంద్రంలో ఓటువేసి.. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన కాంగ్రెస్ పార్లమెంట్ ఎన్నికల సమావేశంలో పాల్గొన్నారు. షాద్‌నగర్‌లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఓటు వేయగా.. కల్వకుర్తిలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జడ్పీ వైస్‌ఛైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, కల్వకుర్తి జడ్పీటీసీ, బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్‌లు ఓటుహక్కు వినియోగించుకున్నారు.

### సీఎంకు బహుమతిగా ఇస్తాం...

బీఆర్ఎస్ పాలనలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు చాలా ఇబ్బందులు పడ్డారు. మర్యాద లేక.. పదవి ఉన్నా పనిలేక.. నిధులు లేక కష్టనష్టాలకు ఓర్చారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయాన్ని ఎవరూ ఆపలేరు. సీఎం రేవంత్‌రెడ్డికి ఈ గెలుపును బహుమతిగా ఇస్తాం. వారికి బలం ఉన్నా.. అందరూ నాకే ఓటు వేశారు. 300 ఓట్ల మెజారిటీతో కచ్చితంగా గెలవబోతున్నాం.. అందరితో మాట్లాడాం.. వారంతా మద్దతు తెలిపారు.

- మన్నె జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి

### 300 పైచిలుకు మెజారిటీతో గెలుస్తా...

బీఆర్ఎస్ అభ్యర్థిగా తాను బరిలో నిలవడంతో పార్టీ కేడర్ అంతా ఏకతాటిపైకి వచ్చి పనిచేసింది. సీఎం సొంత జిల్లా కావడంతో క్రాస్ ఓటింగ్ జరుగుతుందని అందరూ అన్నారని, కానీ క్రాస్ ఓటింగ్ కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌కు జరిగింది. మాకు 300 పైచిలుకు మెజారిటీ కచ్చితంగా వస్తుంది. కాంగ్రెస్ వారు ప్రలోభాలకు గురిచేసినా.. మా సభ్యులంతా బీఆర్ఎస్‌కే ఓటు వేశారు. 2వ తేదీన విజయ కేతనం ఎగురవేస్తున్నాం.

- నవీన్‌కుమార్ రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి



కొడంగల్‌లో ఓటు వేసేందుకు వెళ్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

### ఓటు వినియోగించుకున్న సీఎం

మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో సీఎం రేవంత్ రెడ్డి కొడంగల్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేరుగా హైదరాబాద్ నుంచి మధ్యాహ్నం కొడంగల్‌కు చేరుకున్నారు. ఎంపీడీవో కార్యాలయంలోకి వెళ్లి ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రం బయట ఉన్న వారికి అభివాదం చేస్తూ కొడంగల్‌లో తన స్వగృహానికి చేరుకొని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.

### ఎక్స్ అఫీషియో సభ్యురాలిగా సత్యవతి రాథోడ్..

మాజీ మంత్రి, మహబూబాబాద్ ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ గురువారం షాద్‌నగర్ పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వంలో కొత్తూరు మున్సిపాలిటీ ఎన్నికల సమయంలో ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఎమ్మెల్సీలు బసవరాజు సారయ్య, సురభీ వాణీదేవి, సత్యవతి రాథోడ్‌లు ఇక్కడ తమ పేరు నమోదు చేసుకున్నారు. ప్రస్తుతం కొత్తూరు మున్సిపాలిటీ నుంచి ఎక్స్ అఫీషియో మెంబర్‌గా మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో సత్యవతి రాథోడ్ తన ఓటును వినియోగించుకున్నారు.



కొడంగల్‌లో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

### క్యాంపుల నుంచి నేరుగా పోలింగ్ కేంద్రాలకు

స్థానిక సంస్థల ఎన్నిక నేపథ్యంలో అటు బీఆర్ఎస్, ఇటు కాంగ్రెస్ సభ్యులను పోటాపోటీగా గోవా తదితర ప్రాంతాలకు వారం రోజుల క్రితమే తరలించారు. అక్కడి నుంచి బస్సు ద్వారా నేరుగా ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్న సభ్యులు పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొడంగల్‌లో పోలింగ్ సరళిని వికారాబాద్ జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి పరిశీలించారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ సుధీర్ బాబు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు.

### పోలైన ఓట్ల వివరాలు

| పోలింగ్ కేంద్రం | మొత్తం ఓట్లు | పోలైనవి | పురుషులు | మహిళలు | పోలింగ్ శాతం |
|---|---|---|---|---|---|
| మహబూబ్‌నగర్ | 245 | 245 | 117 | 128 | 100 |
| కొడంగల్ | 56 | 56 | 27 | 29 | 100 |
| షాద్‌నగర్ | 171 | 171 | 77 | 94 | 100 |
| నారాయణపేట | 205 | 204 | 89 | 115 | 99.51 |
| వనపర్తి | 218 | 218 | 99 | 119 | 100 |
| గద్వాల | 225 | 225 | 91 | 134 | 100 |
| కొల్లాపూర్ | 67 | 67 | 28 | 39 | 100 |
| నాగర్‌కర్నూల్ | 101 | 100 | 48 | 52 | 99.09 |
| అచ్చంపేట | 79 | 79 | 37 | 42 | 100 |
| కల్వకుర్తి | 72 | 72 | 31 | 41 | 100 |
| మొత్తం | 1,439 | 1,437 | 644 | 793 | 99.86 |

## లోక్‌సభ ఎన్నికల్లో ప్రలోభాలకు తావివ్వద్దు

- డబ్బు, మద్యం, కానుకలు, మత్తు పదార్థాల పంపిణీపై ప్రత్యేక నిఘా
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, మార్చి 28 : ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే డబ్బు, మద్యం, కానుకలు, మత్తు పదార్థాలు వంటి వాటిపై ప్రత్యేక నిఘా పెట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా ఇంటలిజెన్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారదర్శకంగా, ప్రశాంతంగా లోకసభ ఎన్నికలు జరిగేలా అధికారులు సమష్టిగా పని చేయాలని ఆదేశించారు. ఎన్నికల్లో వ్యయ నియంత్రణ ప్రధాన అంశమని, ప్రతీ ఖర్చును లెక్కించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే డబ్బు, మద్యం, కానుకలు, మత్తు పదార్థాలు తదితర వాటిపై ప్రత్యేక నిఘా పెట్టి.. స్వాధీనం చేసుకోవాలని, బాధ్యులపై కేసులు నమోదు చేయాలని సూచించారు. ఇందుకోసం నియమించిన ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వైలెన్స్, స్టాటిస్టికల్ సర్వైలెన్స్, వీడియో వీనింగ్ బృందాలు, సమర్థవంతంగా పని చేయాలని తెలిపారు. జిల్లాలో ఎన్నికల కోడ్ వెలువడినప్పటి నుంచి ఎన్నికల ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాల ద్వారా ఇప్పటివరకు రూ.79,41,650 నగదు, రూ.4,18,700 విలువైన 5.30కిలోల సిల్వర్, రూ.37,53,050 విలువగల 5822.53 లీటర్ల మద్యం, రూ.3,03,25,575 విలువగల 716.925 కిలోల డ్రగ్స్/నార్కోటిక్స్‌ను సీజ్ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అబ్కారీ, రవాణా, వాణిజ్య పన్నులు తదితర శాఖల సిబ్బంది ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, రూ.10లక్షలు పైగా డబ్బు పట్టుపబడిన సందర్భంలో ఆదాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. బ్యాంకు లావాదేవీలపై ప్రతీరోజు నివేదిక అందించాలని ఆయన తెలిపారు. కాగా, అక్రమ మద్యం నిల్వలు, మద్యం రవాణాపై దాడులు నిర్వహించాలని అబ్కారీ అధికారులకు సూచించారు. గత శాసనసభ ఎన్నికల్లో మాదిరిగా ఈ ఎన్నికల్లో అధికారులు సమష్టిగా కృషి చేస్తూ.. అక్రమంగా డబ్బు, మద్యం, ఇతర కానుకలు పంచిపెట్టడాన్ని అరికట్టాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్వో సంగీత, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

## కలెక్టరేట్‌లో జిల్లా ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు

- ఛైర్మన్‌గా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీలత

రంగారెడ్డి అర్బన్, మార్చి 28 : భారత ఎన్నికల కమిషన్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ భారత ఎన్నికల సంఘం స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ప్రకారం జప్తుచేసిన నగదు, ఇతర వస్తువుల విడుదలకు పనిచేస్తుంది. ఈ జిల్లా ఫిర్యాదుల కమిటీ ఛైర్మన్‌గా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత, కన్వీనర్‌గా జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్, సభ్యులుగా డీటీవో వెంకట్ రెడ్డిలను నియమించారు. ఫిర్యాదుదారుల నగదు, ఇతర వస్తువుల విడుదలకు సంబంధిత వివరాలు, పత్రాలతో జిల్లా ఫిర్యాదుల కమిటీని సంప్రదించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక తెలిపారు. మరిన్ని వివరాలకు 9849720054 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

## ఏప్రిల్ 6న కాంగ్రెస్ భారీ బహిరంగ సభ

- జనజాతర పేరుతో తుక్కుగూడలో నిర్వహణ
- మహేశ్వరం నియోజకవర్గం నుంచి 25 వేలకు పైగా జన సమీకరణ
- ఏర్పాట్లకు సిద్ధమవుతున్న మహేశ్వరం కాంగ్రెస్ నేతలు

మహేశ్వరం, మార్చి 28 : జన జాతర పేరుతో కాంగ్రెస్ పార్టీ లోక్ సభ ఎన్నికల ప్రచారం మొదలుపెట్టేందుకు మహేశ్వరం మండలం తుక్కుగూడ మరోసారి వేదిక కానుంది. ఈమేరకు ఏప్రిల్ 6న భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు అధిష్ఠానం నిర్ణయించింది. ఈ సభకు మహేశ్వరం నియోజకవర్గం నుంచి 25 వేలకు పైగా జనసమీకరణ చేసేందుకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి(కేల్లార్)తో పాటు పార్టీకి చెందిన ఇతర ముఖ్యనాయకులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికలకు ముందు 2023 సెప్టెంబరు 17న తుక్కుగూడలో విజయభేరి పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహించారు. సోనియా, రాహుల్‌గాంధీ, మల్లిఖార్జున్ ఖర్గేలతో పాటు తదితర అగ్రనాయకులు హాజరయ్యారు. అదే తరహాలో ఇప్పుడు జరగబోయే లోక్‌సభ ఎన్నికలకు కూడా ప్రచారం ఇక్కడి నుంచే మొదలుపెట్టాలని టీపీసీసీ నేతలతో పాటు రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. లోకసభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత కాంగ్రెస్ ఏర్పాటు చేస్తున్న మొదటిసభకు తుక్కుగూడ వేదిక కానుండడంతో అధిక ప్రాధాన్యత సంతరించుకుంది. ఆరు గ్యారెంటీల తరహాలోనే లోకసభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ దేశవ్యాప్తంగా రూపొందించిన మేనిఫెస్టోను తుక్కుగూడలో ప్రకటించనున్నారు. ఈ సభను చరిత్రలో నిలిచేలా అన్ని జిల్లాల నుంచి భారీగా జన సమీకరణచేసి విజయవంతమయ్యేలా చేయాలని నాయకులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. కాగా, సభ ఏర్పాట్లకు పార్టీ అధిష్ఠానం నుంచి ఏ క్షణంలో ఎవరికి పిలుపు వస్తుందో? ఏ బాధ్యత అప్పజెప్పుతారోనని నియోజకవర్గ నాయకుల్లో టెన్షన్ మొదలైంది. ఈమేరకు నేడు(శుక్రవారం) తుక్కుగూడలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయనున్నారు.






## రైల్వే గేట్ల మూసివేత

వికారాబాద్, మార్చి 28: ఎమర్జెన్సీ ట్రాక్ రిపేర్ కారణంగా ఈనెల 29నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు రైల్వే గేట్లను మూసివేయనున్నట్లు ఆర్‌పీఎఫ్ ఎస్ఐ రాజేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వికారాబాద్ నుంచి గోధుమగూడ, బూర్గుపల్లి అంతారం వెళ్లే దారిలో ఉన్న రైల్వే గేట్లు మూసి ఉంటాయని తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

## నేడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రారంభం


వికారాబాద్, మార్చి 28: వికారాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ఈనెల 28వ తేదీన శుక్రవారం తెలంగాణ అసెంబ్లీ స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ దీన్ని ప్రారంభించనున్నారు. వికారాబాద్ ఎమ్మెల్యేగా గెలుపొందిన తరువాత వారికి అనువుగా ఉండే విధంగా క్యాంపు కార్యాలయాన్ని అందగా ముస్తాబు చేశారు. ప్రారంభోత్సవానికి పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. పై అంతస్తులో స్పీకర్ ఉండే విధంగా ముస్తాబు చేశారు. కింది భాగంలో ప్రజలను కలిసే విధంగా క్యాబిన్ హాల్ ఏర్పాటు చేయించారు. అదేవిధంగా కార్యాలయం చుట్టూ ప్రహరీ, ప్రజల సౌకర్యార్థం బయట మరుగుదొడ్ల ఏర్పాటు సైతం చేశారు.


ప్రారంభోత్సవానికి ముస్తాబైన వికారాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం

## 'నిరుద్యోగులపై కాంగ్రెస్ కక్ష సాధింపు'

దోమ, మార్చి 28: ఇందిరమ్మ రాజ్యంలో నిరుద్యోగుల పట్ల రేవంత్ సర్కార్ కక్షసాధింపు చర్యలు అవలంబిస్తోందని బీజేపీ సీనియర్ నాయకుడు బొంగు మల్లేశం ఆరోపించారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ టెట్ నోటిఫికేషన్ విడుదల చేసి దరఖాస్తులకు ఏకంగా రూ.వెయ్యి నిర్ణయించడంతో నిరుద్యోగులకు మోయలేని భారంగా మారిందన్నారు. నిరుద్యోగులు ఓట్లేసిన పాపానికి ఇదేనా న్యాయమని ప్రశ్నించారు. కనీసం రూ.100లేక రూ.200ఫీజు పెంచాలే కానీ ఏకంగా రూ.వెయ్యి చేయడంతో పేపర్-1, 2 రాసేవారు రూ.వేలు చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడుతుందన్నారు. ప్రభుత్వం పేదలను దృష్టిలో ఉంచుకొని టెట్ దరఖాస్తు ఫీజును తగ్గించాలన్నారు.








## 'అంబేడ్కర్ జయంతిని అధికారికంగా నిర్వహించాలి'

మేడ్చల్, మార్చి 28: శామీర్‌పేట మండల కార్యాలయాల వద్ద గల బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతిని ఈసారి అధికారికంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిర్వహించాలని మండల దళిత సేనా అధ్యక్షుడు వజ్జల మురళి కోరారు. ఈమేరకు గురువారం ఆయన జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారికి వినతిపత్రాన్ని అందజేశారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రభుత్వం పరిశీలించి అధికారికంగా అంబేడ్కర్ జయంతిని నిర్వహించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు కృషి

మేడ్చల్ టౌన్, మార్చి 28: తమ కళాశాలలో చదివే విద్యార్థుల ఉత్తమ భవిష్యత్తుకు కళాశాల యాజమాన్యం శాయశక్తులా కృషి చేస్తుందని మేడ్చల్ పట్టణ కిష్టాపూర్ ఎంఆర్ఈఎం ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ వేముల మల్లారెడ్డి అన్నారు. కళాశాలలో గురువారం నిర్వహించిన వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. తమ విద్యాసంస్థలో చదివిన విద్యార్థులకు మంచి ప్లేస్‌మెంట్‌లు ఇప్పించగలుగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐఎస్‌టీఈ జాతీయ సాంకేతిక విద్యా సొసైటీ అధ్యక్షులు డాక్టర్ కాకా సాహేబ్ దేశాయి, ప్రిన్సిపాల్ ఎం.శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.


నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు









































# లోక్‌సభ ఎన్నికల్లో 4 లక్షల మెజార్టీతో గెలుస్తా

- చేవెళ్ల గడ్డపై కాషాయ జెండా ఎగరేస్తాం
- రూ.వేల కోట్లతో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశా
- చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- నర్కూడ నుంచి ప్రజా ఆశీర్వాద యాత్ర ప్రారంభం



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

శంషాబాద్ రూరల్, మార్చి 28: లోక్‌సభ ఎన్నికల్లో తాను 4 లక్షల మెజార్టీతో గెలుస్తానని, చేవెళ్ల గడ్డపై కాషాయ జెండా ఎగరవేస్తామని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం శంషాబాద్ మండలం నర్కూడ అమ్మపల్లి శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ఆయన సతీమణి సంగీతారెడ్డి, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహించారు. అనంతరం ప్రజాఆశీర్వాద యాత్ర ప్రారంభించారు. కార్యక్రమంలో కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు. అనంతరం విశ్వేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. దేశం మొత్తం నరేంద్రమోదీ వేవ్ నడుస్తోందన్నారు. చేవెళ్లలో తాను 4లక్షల మెజార్టీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. గతంలో ఎంపీగా రూ.వేల కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానన్నారు. బీజాపూర్ హైవే నిర్మాణానికి కృషిచేశాను కానీ, గత ప్రభుత్వం భూసేకరణ చేపట్టక పనులు నిలిచాయన్నారు. నరేంద్రమోదీ మరోసారి ప్రధాని అవుతారన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఎంపీ అభ్యర్థే దొరక్క, ఇతర పార్టీ నుంచి తెచ్చుకొని టికెట్ ఇచ్చారని విమర్శించారు. తాను నిరంతరం ప్రజాసేవకు అంకితమయ్యానన్నారు. ప్రజా ఆశీర్వాద యాత్ర 14రోజులు కొనసాగుతుందన్నారు. దేశం సురక్షితంగా ఉండాలంటే ప్రధానిగా నరేంద్రమోదీనే ఉండాలన్నారు. ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. చేవెళ్ల నియోజకవర్గ ప్రజలు ఎంతో అదృష్టవంతులని, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి డబ్బు సంపాదించడానికి రాజకీయాల్లోకి రాలేదని, ప్రజాసేవకే వచ్చారన్నారు. కేంద్రంలో ప్రభుత్వ నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తారని చెప్పారు. ప్రజా ఆశీర్వాద యాత్రకు నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. కార్యక్రమంలో మైలార్‌దేవులపల్లి కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుక్క వేణుగోపాల్, ప్రేమ్‌రాజ్, కిసాన్‌మోర్చా లక్ష్మయ్యయాదవ్, జూకల్ ఎంపీటీసీ ప్రవీణ్‌కుమార్, కుమార్‌యాదవ్, సిద్ధులు, కిట్టు, కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న డీసీపీ సునీతారెడ్డి, ఆర్డీవో అనంతరెడ్డి తదితరులు

## ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి

ఇబ్రహీంపట్నం, మార్చి 28 : ఎన్నికల కోడ్‌ను ఎవరు ఉల్లంఘించినా కఠినమైన చర్యలు ఉంటాయని మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్డీవో కె.అనంతరెడ్డి హెచ్చరించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా సాఫీగా జరిగేట్లు అవసరమైన చర్యలు చేపట్టాలని వారు సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం ఇబ్రహీంపట్నంలోని గురునానక్ ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్లైయింగ్ స్క్వాడ్, ఎస్ఎస్‌టీంలు, పోలీస్ అధికారులు, ఎన్నికల సిబ్బందితో జరిగిన శిక్షణ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ కళాశాలలోనే ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ సామాగ్రి, ఈవీఎంల పంపిణీ, ఎన్నికల అనంతరం ఈవీఎంలను భద్రపరచడం ఉన్నందున స్ట్రాంగ్ రూంల భద్రతా ఏర్పాట్లపై కూడా సమీక్ష చేశారు. ఎన్నికల వేళ రాజకీయ పార్టీల సమావేశాలు, సభలపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలన్నారు. అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు, సభలు జరుపరాదని చెకింగ్‌లు విధిగా నిర్వహించాలని చెప్పారు. ఏదైనా సమస్య తలెత్తిన వెంటనే తమకు సమాచారమందించాలని వారు ఆదేశించారు. సమావేశంలో ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, సీఐ బి.సత్యనారాయణ తదితరులున్నారు.




గ్రాడ్యుయేషన్ డేలో చిన్నారులు

## చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే

షాద్‌నగర్‌అర్బన్, మార్చి 28: చిన్నారుల్లో ఉత్సాహాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంచడానికే యూకేసీ పూర్తి చేసిన చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించామని ఠాగూర్ పాఠశాల కరస్పాండెంట్ ఎన్‌కె రాజేంద్రప్రసాద్ చెప్పారు. ఆ పాఠశాలలో గురువారం యూకేసీ పూర్తి చేసిన చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించి, పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ డిగ్రీ పట్టాలను ఇచ్చే సమయంలో నిర్వహించే గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని యూకేజీ పూర్తి చేసిన చిన్నారులకు నిర్వహించడం వల్ల వారికి చదువు పట్ల ఆసక్తి పెరుగుతుందని, పాఠశాలకు రావాలన్న ఉత్సాహం కలుగుతుందని అన్నారు. విద్యార్థులు టీవీలు, సినిమాలు, సెల్‌ఫోన్ల జోలికి వెళ్లకుండా, క్రమశిక్షణతో చదువుకోవడానికి తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధను చూపాలని సూచించారు.

## తెలంగాణ జాగీర్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా సూర్యప్రకాశ్

రంగారెడ్డి అర్బన్, మార్చి 28 : తెలంగాణ జాగీర్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా కమ్మరి సూర్యప్రకాశ్ పేరును ఆ పార్టీ నేషనల్ ప్రెసిడెంట్ జి. జయరాజ్ ప్రకటించారు. ఈమేరకు పార్టీ రాష్ట్ర కమిటీలో చర్చించి నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా, కమ్మరి సూర్యప్రకాశ్ విద్యావంతుడని, ప్రజల పక్షాన పార్లమెంట్‌లో చేవెళ్ల సమస్యలపై గళం విప్పాలంటే.. ఆయనకు ఓటేసి గెలిపించాలని కోరారు.

# మేడ్చల్ మున్సిపల్ కార్యాలయంలో రూ.26లక్షలు గోల్‌మాల్!

**ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి నిర్వాకం ● ఆడిట్ అధికారుల విచారణలో వెల్లడి**




మేడ్చల్ టౌన్ మార్చి 28 : మేడ్చల్ మున్సిపల్ కార్యాలయంలో ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి పన్నులు వసూలు చేసిన రూ.26కోట్లను సొంతానికి వాడుకున్న ఉదంతం వెలుగుచూసింది. నెల రోజులుగా ఆడిట్ అధికారులు మున్సిపల్ కార్యాలయంలో ఆడిట్ నిర్వహించి పన్నుల డబ్బును మున్సిపల్ అకౌంట్‌లో జమపై విచారించగా ఈ అవినీతి బయటపడింది. లెక్కలు తేలక నెల రోజులు ఆడిటర్లు తల పట్టుకున్నారు. డబ్బు కాజేసిన వారి వివరాలు రాబట్ట లేక పోయారు. సిటిజన్ సర్వీస్ సెంటర్‌లో ట్యాక్సులు వసూలు చేసే ఔట్ సోర్సింగ్ ఉద్యోగి దివ్యను వెబ్‌సైట్ ద్వారా స్వీకరించిన డబ్బుల వివరాలు తెలుపాలని కోరగా తన వద్ద లాగిన్ వివరాలు లేవని తేల్చి చెప్పారు. అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేస్తామని అనడంతో ట్యాక్సుల నిధుల బాగోతం బయటపడింది. దివ్య వసూలు చేసిన డబ్బుల్లో భారీ మొత్తాన్ని సొంతానికి వాడుకున్నట్లు ఆడిట్ అధికారులు ధ్రువీకరించారు.

### సిటీజన్ సర్వీస్ సెంటర్‌ను అడ్డుపెట్టుకుని

మున్సిపాలిటీలో కొత్తగా ఇంటి నంబర్ పొందదలచిన వారు, హోర్డింగ్‌ల ఏర్పాటు, వాణిజ్య పన్నుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు వీలుకల్పించారు. అలాగే మున్సిపల్ కార్యాలయంలోని సిటిజన్ సెంటర్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగికి వెబ్‌సైట్‌లో లాగిన్ అయ్యి దరఖాస్తు చేసుకున్న వారి నుంచి పన్ను వసూలుకు వీలు కల్పించారు. దీంతో చాలా మంది కార్యాలయానికి వచ్చి సీఎస్‌సీలో సిబ్బంది దివ్యతో అసెస్‌మెంట్ చేయించుకొని దరఖాస్తు చేసుకుని అక్కడే డబ్బు కట్టి రసీదుదు పొందారు. దివ్య ప్రజల డీడీ, చెక్కులు మినహా నగదు మొత్తాన్ని స్వాహా చేసినట్టు తెలుస్తోంది. కాగా సిటిజన్ సెంటర్‌లో స్వీకరించిన నగదును రోజువారీగా బ్యాంకు ఖాతాలో జమచేసేలా చూడాల్సిన మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. అందుకే సదరు ఉద్యోగిని డబ్బులు సొంతానికి వాడుకున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. డీడీలు, చెక్కులు మాత్రం బ్యాంకులో డిపాజిట్ చేసి వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేశారు.

### కొంపముంచిన లాగిన్ వ్యవహారం

కార్యాలయంలో విధులు నిర్వహించేందుకు ఉద్యోగులకు ఆన్‌లైన్ అప్‌డేషన్‌ల కోసం వేరువేరుగా లాగిన్ అయ్యే వీలు కల్పించారు. వీటిపై మున్సిపల్ కమిషనర్ లేదా మేనేజర్ అజమాయిషీ ఉంటుంది. నమ్మకం ఉన్న సిబ్బందికే లాగిన్ కోడ్ ఇచ్చి పనులు చేయిస్తారు. కాగా 2022లో ప్రత్యేకంగా ఒక లాగిన్‌ను ట్యాక్సుల కోసం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగికి ఇచ్చారు. దీంతో సదరు ఉద్యోగిని తానే సొంతంగా వెబ్‌సైట్‌లో లాగిన్ అయి నగదు జమ చేయకుండా దిగ మింగినట్టు ఆడిట్ అధికారులు గుర్తించినట్టు సమాచారం.

### డబ్బు కట్టిన మేనేజర్లు?

ట్యాక్సు వసూలు చేసిన రూ.26లక్షలు స్వాహా చేయడంతో తమ బాధ్యతగా మున్సిపల్ పాత మేనేజర్ శ్రీనివాస్, ప్రస్తుతం మేనేజర్ శ్రీదేవి ఇద్దరు కలిసి రూ.13లక్షలు చెల్లించినట్ట తెలిసింది. ఈ అవినీతిలో ఏ తప్పూ చేయని మేనేజర్లు సొంత డబ్బు ఇచ్చి మున్సిపల్‌లో జరిగిన అవినీతిని కప్పిపుచ్చేందుకు యత్నించగా దీనిలో మతలబు గుర్తించిన ఆడిటర్లు మొత్తం డబ్బు చెల్లించాలంటూ వారిపై వత్తిడి తెచ్చినట్టు తెలిసింది. ఈ అవినీతిలో తమకు సంబంధం లేదని మేనేజర్లు చేతులెత్తేయటంతో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగినినే బాధ్యులు చేసి డబ్బు రికవరీకి ఆడిట్ అధికారులు సిద్ధం అయ్యారు. ఇదిలా ఉంటే మున్సిపల్ అధికారులు ఇప్పటికే ఈ డబ్బు స్వాహాపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలుస్తోంది. అయితే డబ్బు కడితే కేసు వాపస్.. లేదంటే జైలే! అన్నట్టుగా అవినీతిపరులకు చాన్స్ ఇచ్చినట్టు సమాచారం. కేసు విషయం అధికారులు బహిరంగపర్చలేదు. మునిసిపాలిటీలో రూ.26లక్షలు స్వాహా అయినట్టు ఆడిట్‌లో బయటపడిందని, ఇందులో కొంత మేర రికవరీ చేయగా మరికొంత డబ్బు రావాల్సి ఉందని జిల్లా ఆడిట్ అధికారి వెంకటేష్ తెలిపారు. నిధులు దుర్వినియోగం వాస్తవమేనని, దీనిపై రెండు మూడు రోజుల్లో వివరాలు తెలియజేస్తామని చెప్పారు. కార్యాలయంలో ప్రజల పన్నుల నిధులు దుర్వినియోగంపై పూర్తి విచారణ జరుగుతోందని, ఆడిట్ నివేదిక తర్వాతే వివరాలు తెలుస్తాయని మున్సిపల్ మేనేజర్ శ్రీదేవి తెలిపారు.

### పనితీరు బాగాలేదని మాజీ కమిషనర్ తొలగించినా...

ఇదిలా ఉంటే కొందరు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పనితీరు సరిగా లేక పాత కమిషనర్ షఫీఉల్లా చర్యలు తీసుకున్నారు. వారిలో దివ్య, కంప్యూటర్ ఆపరేటర్ ప్రవీణ్, హరితాహారం కోఆర్డినేటర్ ప్రియాంక, వర్క్‌ఇన్‌స్పెక్టర్ లావణ్యలను ఆయన విధుల నుంచి తొలగించారు. ఆయన బదిలీ అయిన వెంటనే ఈ నలుగురు ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని తిరిగి విధుల్లోకి తీసుకున్నారు. దీంతో అవినీతికి ఆజ్యం పోసినట్టయింది.

## ప్రశాంతంగా బయోలాజికల్ సైన్స్ పరీక్ష

వికారాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో గురువారం జరిగిన పదో తరగతి బయోలాజికల్ సైన్స్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో మొత్తం 80 పరీక్షా కేంద్రాల్లో 14,741 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 14,585మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈపరీక్షకు 156 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈ పరీక్షకు జిల్లాలో 98.94శాతం విద్యార్థుల ఉత్తీర్ణత నమోదైంది. రెగ్యులర్ విద్యార్థులు 13,412 మంది ఉండగా, వారిలో 13,347 మంది హాజరు కాగా, 65 మంది గైర్హాజరయ్యారు. అదే వన్స్ ఫెయిల్డ్ విద్యార్థులు 1,329 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, వారిలో 1,238 మంది హాజరయ్యారు. 91మంది గైర్హాజరయ్యారు. రెగ్యులర్ విద్యార్థుల్లో 99.51శాతం, వన్స్ ఫెయిల్డ్ విద్యార్థుల్లో 93.15 శాతం హాజరు నమోదైంది.



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

## వాహనాల తనిఖీ ముమ్మరం

యాచారం, మార్చి 28 : లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న కొద్ది పోలీసులు వాహనాల తనిఖీని ముమ్మరం చేశారు. ప్రతి రోజు మాల్ నుంచి ఆగాపల్లి వరకు నెంబర్ ప్లేట్ లేని వాహనాలు, త్రిబుల్‌రైడింగ్ చేస్తున్న వాహనాలు, మైనర్లు నడుపుతున్న వాహనాలతోపాటు, అనుమానిత వాహనాలను యాచారం పోలీసులు తనిఖీ చేస్తున్నారు. గురువారం ఎలాంటి పత్రాలు లేని పలు వాహనాలను తనిఖీ చేసి వాహనయజమానులకు జరిమానా విధించి కేసులు నమోదు చేశారు. నెంబర్‌ప్లేట్ లేని వాహనాదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్న వాహనాదారులను ఆపి కౌన్సిలింగ్ ఇచ్చారు.

# రేపటి నుంచి పాంబండ రామలింగేశ్వరస్వామి జాతర



పాంబండ దేవాలయం (ఇన్‌సెట్‌లో శ్రీ రామలింగేశ్వరస్వామి)

కులకచర్ల, మార్చి 28: దక్షిణ రామేశ్వరంగా పేరొందిన కులకచర్ల మండలంలోని బండవెల్కిచర్ల గ్రామ ఏకశిల పర్వత పాంబండ శ్రీరామలింగేశ్వరస్వామి జాతర ఈ నెల 30 నుంచి ప్రారంభం కానుంది. ఏప్రిల్ 9 వరకు ఉత్సవాలు కొనసాగుతాయని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. పాంబండ శ్రీ రామలింగేశ్వరస్వామిని దర్శించుకుంటే పాపవినాశనం కలుగుతుందని భక్తుల నమ్మకం. కోనేరులో స్నానంచేస్తే సమస్త రోగాలు దూరమవుతాయని భక్తులు విశ్వసిస్తారు. ఈ జాతరకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్ నర్సమ్మ రాములు, ఈవో సుధాకర్ తెలిపారు.

### జాతర ఉత్సవ కార్యక్రమాలు

ఈనెల 30న ఆలయంలో గణపతి హోమం, ధ్వజారోహణం, సాయంత్రం బండవెల్కిచర్ల గ్రామం అర్చకుల ఇంటి నుంచి స్వామివారి ఊరేగింపు కొండపైకి వచ్చుట, రాత్రి పల్లకీసేవ, 31న రుద్రహోమం, పల్లకీసేవ, ఏప్రిల్ 1న సాయంత్రం శకటోత్సవం, పల్లకీసేవ, 2, 3తేదీల్లో పల్లకీసేవ, హారతి, 4వ తేదీన పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం, తెల్లవారుజామున రథోత్సవం, 5, 6 తేదీల్లో పల్లకీసేవ, హారతి కార్యక్రమం, 7వ తేదీన రాత్రి అగ్నిగుండాలు, 8వ తేదీన అమావాస్య సర్వదర్శనం, 9వ తేదీన నూతన సంవత్సరం, ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారి దర్శనం, స్వామివారు గ్రామానికి వెళ్లుట తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

పాంబండపై గుండం



### క్షేత్ర మహత్యం

పాంబండ క్షేత్రం పూర్వకాలంలో ఒకే గుట్టగా ఉండేది. ఒక సర్పం గుట్ట నడిభాగం నుంచి వెళ్లడంతో రెండు గుట్టలుగా చీలి పోయిందని పురాణాలు చెబుతున్నాయి. రావణ సంహరణ అనంతరం శ్రీరామచంద్రస్వామి ఈ ప్రాంతానికి వచ్చి ఇట్టి ఏకశిల పర్వతం రాతిలోకి విసరడంతో బాణం వలే గుండం ఏర్పడిందని, అట్టి గుండం నీటితో శ్రీరామచంద్రస్వామి వారు లింగ ప్రతిష్ఠ చేసి అభిషేకం చేసినట్లు పురాణాల్లో ఉంది. ఈ గుండంలో స్నానం చేయడంతో సమస్త రోగాలు పోతాయని అట్టి నీటిని పశువులపై, ఇంట్లో, పొలాల్లో ఇప్పటికీ భక్తులు చల్లుకుంటారు. ప్రతీ సంవత్సరం రెండు పర్యాయాలు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. మొదటగా శ్రావణమాసం చివరి సోమవారం, రెండోసారి ఉగాదికి పదిరోజుల ముందు ప్రారంభమై ఉగాదితో ముగుస్తుంది.

## బీఆర్ఎస్‌లోనే ఉంటా

- మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి

తాండూరు, మార్చి 28: పార్టీ మారుతానన్న వదంతులు నమ్మొద్దని తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి అన్నారు. తాండూరులోని తన నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తలతో సమావేశమై మాట్లాడుతూ.. తాను బీఆర్ఎస్‌లోనే ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను మెజార్టీతో గెలిపించుకోవాలని సూచించారు. ఈనెల 30వ తేదీన తాండూరు జీపీఆర్ గార్డెన్‌లో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతారని అన్నారు. కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి



## కమనీయం.. కల్యాణ వైభోగం

- వైభవంగా వేంకటేశ్వరస్వామి లగ్నం
- దేవుని పడకల్‌కు పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- పాల్గొన్న టీఎస్‌పీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

తలకొండపల్లి, మార్చి 28 : రాష్ట్రస్థాయిలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా ఖ్యాతిగాంచిన మండలంలోని దేవుని పడకల్ గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం తిరుకళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కల్యాణానికి దేవుని పడకల్‌తో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు, ముఖ్యంగా మహిళలు తలంబ్రాలతో ఆలయానికి తరలివచ్చారు. ఈ నేపథ్యంలో ఆలయాన్ని, కల్యాణ మండపాన్ని పచ్చటి తోరణాలు, రంగురంగుల పుష్పాలతో శోభాయామానంగా అలంకరించారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి అనిత దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వేంకటేశ్వరస్వామి దేవాలయం నుంచి కల్యాణ మండపం వరకు బ్యాండ్ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఉత్సవ విగ్రహాలను తీసుకువచ్చారు. ఆలయ అనువంశిక ధర్మకర్త లట్టుపల్లి రాజ్‌కుమార్‌రెడ్డి, ఈవో స్నేహలతల ఆధ్వర్యంలో అర్చకులు మేళతాళాలు, వేదమంత్రాల నడుమ స్వామివారి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు విశాల వసతులు ఏర్పాటు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న నాయకులను నిర్వాహకులు ఆలయ మర్యాదలతో సత్కరించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు, శతాబ్ది టౌన్‌షిప్ నిర్వాహకుడు శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీశైలం, మాజీ ఉప సర్పంచ్ తిరుపతి, లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మోదీ నాయకత్వాన్ని సమర్థిస్తూ బీజేపీలో చేరిక



ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరుతున్న గుండ్ల పోచంపల్లి కౌన్సిలర్లు

మేడ్చల్ టౌన్, మార్చి 28: ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వాన్ని సమర్థిస్తూ నేడు ఎందరో ఇతర పార్టీల నాయకులు బీజేపీలో చేరుతున్నారని మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి చెందిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్, సకరబోయిన రజిత వెంకటేష్‌లు గురువారం ఈటల సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. మేడ్చల్ నియోజకవర్గంలోని పలు మున్సిపాలిటీల నుంచి పెద్దఎత్తున బీఆర్ఎస్ కౌన్సిలర్లు, పార్టీ పదాధికారులు తమ పార్టీలో చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన వారు కష్టపడి పనిచేసి తన విజయానికి కృషి చేయాలని కోరారు. వారికి తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, నియోజకవర్గం కన్వీనర్ మోహన్‌రెడ్డి, నారెడ్డి నందారెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి

- డీఆర్డీవో సూర్యారావు
- మంచాలలో అవగాహన ర్యాలీ




అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ఐకేపీ సిబ్బంది

మంచాల, మార్చి 28 : రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును అర్హులందరూ తప్పకుండా వినియోగించుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి సూర్యారావు ప్రజలకు సూచించారు. గురువారం ఓటుహక్కు వినియోగంపై స్వీప్ ఆధ్వర్యంలో మంచాలలో అధికారులు, పంచాయతీ రాజ్, సెర్ప్, ఐకేపీ, ఉపాధిహామీ పథకం సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం మండల కేంద్రం నుంచి మంచాల బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటుహక్కు ఆవశ్యకతపై ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాలచందర్, డీపీఎంఏపీ బాల్‌రాజ్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మలత, ఏపీఎం శోభ, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్యాలయంలోనే పన్నులు చెల్లించాలి

● శంకర్‌పల్లి కమిషనర్ శ్రీనివాస్

చేవెళ్ల, మార్చి 28 : శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని ప్రజలు పన్నులు నేరుగా మున్సిపాల్ కార్యాలయంలోనే చెల్లించాలని కమిషనర్ శ్రీనివాస్ చెప్పారు. గురువారం ఆయన శంకర్‌పల్లిలో మాట్లాడుతూ శంకర్‌పల్లి పట్టణ కేంద్రంలోని వ్యాపారులు, దుకాణదారులు ట్రేడ్ లైసెన్స్ ఫీజులు చెల్లించలేదన్నారు. చెల్లింపులను ఆన్‌లైన్, ట్రాన్స్‌ఫర్ చేయవద్దని చెప్పారు. మున్సిపల్ సిబ్బందికిగాని, కార్యాలయంలోగాని నేరుగా పన్నులు చెల్లించాలని సూచించారు. పలువురు తప్పుడు ఫోన్ చేసి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయంలో మోసపోకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

## అనుమతులు లేకుండా వెంచర్లు చేస్తే చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

ఆమనగల్లు, మార్చి 28 : అనుమతులు లేకుండా వెంచర్లు చేస్తే చర్యలు తప్పవని డీటీసీపీ అధికారులు హెచ్చరించారు. ఆమనగల్లు మున్సిపాలిటీ ముర్తోజుపల్లి గ్రామ సమీపంలో సర్వే నెంబర్ 31 లోని భూమిని గురువారం అధికారులు సందర్శించారు. ఆ సర్వేనెంబర్‌లోని తన 3.09 ఎకరాల భూమిని పక్కనే వెంచర్ చేస్తున్న నిర్వాహకులు ఆక్రమించుకొని అక్రమంగా మట్టితవ్వుతున్నారని రైతు వెంకటకిషన్‌జీ ఇటీవల జిల్లా, స్థానిక అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డీటీసీపీకి చెందిన ఏడీ సత్యభామ, ఆమనగల్లు తహసీల్దార్ లలిత, మున్సిపల్ కమిషనర్ వసంత, టౌన్‌ప్లానింగ్ అధికారులు అట్టిభూమిని సందర్శించి పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని అధికారులు చెప్పారు.

## పాడైపోయిన రోడ్డుకు రీబీటీ



రీబీటీ చేస్తున్న మేడిపల్లి రోడ్డు

యాచారం, మార్చి 28 : కందుకూరు మండలంలోని మీర్‌ఖాన్‌పేట నుంచి యాచారం మండలంలోని మేడిపల్లి వరకు ఉన్న రోడ్డుకు వారం రోజులుగా ఆర్ అండ్‌బీ అధికారులు రీబీటీ వేస్తున్నారు. 30 ఏళ్ల క్రితం వేసిన బీటీ రోడ్డు చాలా వరకు పాడైపోవడంతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కున్నారు. ఇది గమనించిన మహేశ్వరం ఎమ్మెల్యే ప.సబితాఇంద్రారెడ్డి ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులతో మాట్లాడి రోడ్డుకు రీబీటీ చేయించాలని అధికారులను ఆదేశించారు. రూ.20లక్షల వ్యయంతో రోడ్డకు రీబీటీ చేస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు వాహనాదారులు ఆమెకు ధన్యవాదాలు చెప్పారు.

## పేదింటి ఆడబిడ్డ పెళ్లికి సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న బుచ్చిబాబు

తలకొండపల్లి, మార్చి 28 : పేదింటి ఆడబిడ్డ పెళ్లికి తలకొండపల్లి జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చేయూతనందించారు. కేశంపేట మండలం తులవాని గడ్డ గ్రామానికి చెందిన బేరి సుగుణమ్మసుక్కయ్య దంపతుల కుమార్తె శ్రుతి వివాహానికి ట్రస్ట్ ద్వారా ఆయన రూ. 10 వేలు సమకూర్చారు. గురువారం ట్రస్ట్ సభ్యుడు బుచ్చిబాబు వారికి ఆ నగదును అందజేశారు. ఉప్పల ట్రస్ట్ ద్వారా నిరుపేద కుటుంబాలకు చేయూతనందిస్తున్న వెంకటేశ్‌ను పలువురు అభినందించారు. కార్యక్రమంలో తిరుపతి, అశోక్, తదితరులు ఉన్నారు.

# సీఎం రాక.. పోలీసుల ఆంక్షలు



బస్సుల దారి మళ్లించడంతో చేవెళ్లలో నడుచుకుంటు వెళుతున్న ప్రయాణికులు

చేవెళ్ల, మార్చి 28 : ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ వెళ్లిన సందర్భంగా గురువారం చేవెళ్ల మండలంలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సీఎం హైదరాబాద్ - బిజాపూర్ జాతీయ రహదారిపై చేవెళ్ల మీదుగా వికారాబాద్ జిల్లా కొడంగల్ వరకు రోడ్డు మార్గం ద్వారా వెళ్లారు. ఆయన రాక సందర్భంగా పోలీసుల హడావిడి కనిపించింది. పోలీస్ అకాడమి మొదలు కొని మొయినాబాద్, చేవెళ్ల మీదుగా పోలీస్ పహరా అడుగడుగునా కనిపించింది. దారిపొడువునా పోలీసుల వాహనలే దర్శనమిచ్చాయి. మొయినాబాద్ మండల పరిధిలోని హిమయాత్‌నగర్ మీదుగా చేవెళ్ల మండల పరిధిలోని ఎన్కెపల్లి, ముడిమ్యాల్ నుంచి ఆలూర్ మీదుగా వాహనాలను దారి మళ్లించారు. చేవెళ్ల పట్టణ కేంద్రం మీదుగా వచ్చే వాహనాలను చేవెళ్ల నుంచి శంషాబాద్ వెళ్లే రోడ్డు మీదుగా మళ్లించారు. దీంతో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. అసలే పెళ్లిల్ల సీజన్, మరో పక్క మండుతున్న ఎండలతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. కాగా ట్రాఫిక్ పోలీసులు చేవెళ్ల పట్టణ కేంద్రంలోని హోటళ్ల ముందు వాహనాలు నిలుపరాదని ఆ యజమానులను హెచ్చరించారు. కాగా పోలీసుల తీరుపై పలువురు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## బార్ అసోసియేషన్ కార్యవర్గాలు ఎన్నిక



చేవెళ్ల 'బార్' నూతన కార్యవర్గం

చేవెళ్ల, మార్చి 28 : చేవెళ్ల బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం చేవెళ్ల మున్సిఫ్ కోర్టు ఆవరణలో జరిగాయి. ఎన్నికల సందర్భంగా కోర్టు ఆవరుణ న్యాయవాదులతో నిండిపోయి సందడి సందడిగా నెలకొన్నది. చేవెళ్ల బార్ అసోషియేషన్ అధ్యక్షుడిగా జి. శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా డి. గౌతమ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బి. సత్యనందం, సంయుక్త కార్యదర్శిగా ఎండి. తాజుద్దీన్, కోషాధికారిగా ఈ. జనార్ధన్, లైబ్రేరియన్‌గా ఎం. గోపాల్, సాంస్కృతిక కార్యదర్శిగా ఎండి. ముఖ్తార్ షరీఫ్, మహిళా ప్రతినిధిగా పి. రోజారెడ్డి, సభ్యులుగా ఏ. శ్రీధర్, కె. యాదగిరిగౌడ్, సిహెచ్. రవీందర్, ఎం. శివరాజ్‌గౌడ్, ఎస్. ఈశ్వర్ తదితరులు ఎన్నికయ్యారు. సీనియర్ న్యాయవాది జి. పాండురంగా రెడ్డి సమక్షంలో ఎన్నికలు నిర్వహించారు. నూతన బార్ అసోషియేషన్ కమిటీని న్యాయవాదులు అభినందించారు.

**ఆమనగల్లు :** ఆమనగల్లు బార్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోగా నూతన అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది మల్లేపల్లి జగన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మాజీ అధ్యక్షుడు లక్ష్మణశర్మ పర్యవేక్షణలో ఆమనగల్లు కోర్టు ఆవరణలో గురువారం న్యాయ వాదులు సమావేశమై నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కడ్తాల మండలం వాసుదేవ్‌పూర్ గ్రామానికిచెందిన మల్లేపల్లి జగన్, ఉపాధ్యక్షుడిగా బండెల సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా దుడ్డు ఆంజనేయులుయాదవ్, సంయుక్త కార్యదర్శిగా ఏ. రామకృష్ణ, కోశాధికారిగా బి. మధు, లైబ్రేరియన్‌గా ఎర్రవోలు శేఖర్ ఎన్నికయ్యారు. వారిని బార్ అసోసియేషన్ సభ్యులు సత్కరించి అభినందించారు. బార్ అసోసియేషన్ సభ్యులు మల్లేశ్ గౌడ్, జానకిరాములుయాదవ్, అండెకార్ యాదిలాల్, విజయ్‌కుమార్, మల్లేశ్, కొప్పు కృష్ణ, గణేశ్, దేవేందర్, మల్లేశ్, బీక్యనాయక్, మురళి, కృష్ణ, శ్రీనివాసులు, పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం 'బార్' అధ్యక్షుడు అంజన్‌రెడ్డి

**ఇబ్రహీంపట్నం :** ఇబ్రహీంపట్నం బార్ అసోషియేషన్ 2024-25 సంవత్సరానికిగాను గురువారం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఎస్.అంజన్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా ఎ.రమేష్, ప్రధాన కార్యదర్శిగా జేపీ మహేందర్, సంయుక్త కార్యదర్శిగా ధనంజయ, సాంస్కృతిక కార్యదర్శిగా పి.గణేష్, ట్రెజరర్‌గా ఎం.జగన్, లైబ్రేరియన్‌గా వై.భాస్కర్, కార్యవర్గ సభ్యులుగా జె.జగన్, బి.జంగయ్య ఎన్నికయ్యారు.



ఆమనగల్లు 'బార్' అధ్యక్షుడు జగన్

**షాద్‌నగర్‌అర్బన్ :** షాద్‌నగర్ కోర్టు సముదాయంలో గురువారం బార్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడిగా బి. రాజశేఖర్‌రాజు ఎన్నికయ్యారు. అధ్యక్ష పదవి కోసం ముగ్గురు పోటీ పడగా రాజశేఖర్‌రాజు 38 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారని ఎన్నికల అధికారి మర్రి శంకరయ్య తెలిపారు. ఉపాధ్యక్షులుగా టి. శ్రీనివాస్, విజయభాస్కర్‌గౌడ్, గ్రంథాలయ కార్యదర్శిగా ఎల్. లక్ష్మయ్య విజయం సాధించారని చెప్పారు. ప్రధాన కార్యదర్శిగా ఎం. శ్రీధర్‌గౌడ్, సంయుక్త కార్యదర్శులుగా సిహెచ్ మధుసుదన్‌రావు, ఎం. నరేంద్రనాథ్‌లు, కోశాధికారిగా వి. రాఘవేంద్రచారి, మహిళా ప్రతినిధిగా ఎస్. జయమ్మలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను తోటి న్యాయవాదులు ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు.



షాద్‌నగర్'బార్' అధ్యక్షుడు రాజశేఖర్‌రాజ్

## మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యం



నాగర్‌గూడలో మాట్లాడుతున్న విశ్వేశ్వర్‌రెడ్డి

షాబాద్, మార్చి 28 : మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమతుందని, చేవెళ్ల గడ్డ మీద బీజేపీ జెండా ఎగరేయాలని ఆ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆయన చేపట్టిన చేవెళ్ల ప్రజా ఆశీర్వాద యాత్ర గురువారం మండలంలోని మద్దూర్, హైతాబాద్, చందన్‌వెళ్లి, రుద్రారం, నాగర్‌గూడ, తాళ్లపల్లి, తిమ్మారెడ్డిగూడ, వెంకమ్మగూడ, రేగడిదోస్వాడ, తిర్మలాపూర్ వరకు సాగింది. ఈ సందర్భంగా ఆయన గ్రామాల్లో ప్రజల సమస్యలను అడిగితెలుసుకున్నారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సేవకే తన జీవితం అంకితమని, మోదీ తనకు ఆదర్శమని చెప్పారు. ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను తీసుకువచ్చిన ఘనత మోదీదే అన్నారు. ప్రపంచం భారత్‌వైపు చూస్తున్నదని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రత్నం, సీనియర్ నాయకులు ప్రకాష్ ప్రతాప్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, యువమోర్చా జిల్లా కార్యదర్శి మహేందర్, స్వచ్ఛ భారత్ సెల్ కన్వీనర్ రాము, పార్టీ మండల అధ్యక్షుడు కిరణ్, ఓబీసీ మోర్చా కార్యదర్శి మాణయ్య, పాల్గొన్నారు.

## నేడు షాద్‌నగర్‌కు కిషన్‌రెడ్డి రాక

షాద్‌నగర్‌అర్బన్, మార్చి 28 : కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి నేడు (శుక్రవారం) షాద్‌నగర్‌కు వస్తున్నారని బీజేపీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ కో-కన్వీనర్ నర్సింహగౌడ్ తెలిపారు. సాయంత్రం 4.00 గంటలకు స్థానిక బైపాస్‌లో గల కుంట్ల రాంరెడ్డి గార్డెన్‌లో జరిగే సమావేశానికి హాజరవుతారని చెప్పారు. బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకె అరుణ ఆధ్వర్యంలో పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అనుచరులతో పాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, విద్యావంతులు బీజేపీలో చేరుతారని అన్నారు. భారత దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తున్న ప్రధాని మోదీకి అండగా నిలువడానికి యువత కూడ తరలివస్తారని నర్సింహగౌడ్ తెలిపారు.

## నేటి నుంచి బ్రహ్మోత్సవాలు



ఆలయంలోని మూలవిరాట్

యాచారం, మార్చి 28 : యాచారం మండల కేంద్రంలోని గుట్టపై వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ఈనెల 31 ఆదివారం వరకు నిర్వహించ బోతున్నట్లు ఆలయ నిర్వాహకులు ఒక ప్రకటనలోతెలిపారు. 29న శ్రీహన్‌మాన్ స్వామి ఆలయం నుంచి గుట్ట వరకు భారీ శోభాయాత్రతో స్వామి వారిని గుట్టపైకి చేర్చడం, ప్రత్యేక పూజలు, హారతి కార్యక్రమాలు, 30న పద్మావతి అలివేలు మంగ సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణోత్సవం, అన్నదానం, రాత్రి వేళ సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, 31న ఉదయం 7గంటలకు రథోత్సవం, హోమం, మధ్యాహ్నం మైసమ్మ ఆలయం వద్ద అన్నదానం, స్వామి వారి గ్రామ ప్రవేశ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు చెప్పారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు చెప్పారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందో నిర్వహించబోతున్నట్లు యాచారం పోలీసులు తెలిపారు.

## ఘనంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జన్మదిన వేడుకలు



మధుసూదన్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి

షాబాద్, మార్చి 28 : టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి జన్మదిన వేడుకలు మొయినాబాద్‌లోని ఆయన వ్యవసాయ క్షేత్రంలో బుధవారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో పరిగి, తాండూర్ ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ షాబాద్ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, నాయకులు నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పేదింటి పెళ్లిళ్లకు పుస్తె, మట్టెలు వితరణ



పుస్తె, మట్టెలు అందిస్తున్న పద్మా నరేందర్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్, మార్చి 28 : పేదింటి ఆడ బిడ్డల పెళ్లిళ్లకు పుస్తె, మట్టెలు దానం చేసి ఫరూఖ్‌నగర్ మండలం కాంసాన్‌పల్లి గ్రామ మాజీ సర్పంచ్ బసిరెడ్డి పద్మా నరేందర్‌రెడ్డి తమ ఔదార్యం చాటుకున్నారు. గ్రామానికి చెందిన సత్తయ్య కూతురు మహేశ్వరి, బుచ్చయ్య కూతురు మహేశ్వరి వివాహానికి వారు రూ. 40 వేల విలువ గల పుస్తె, మట్టెలను గురువారం వారి స్వగృహంలో అందించారు.

## క్రైం కార్నర్

### రోడ్డు ప్రమాదంలో తల్లి మృతి

● కుమారుడికి తీవ్ర గాయాలు

షాద్‌నగర్, మార్చి 28 : రోడ్డు ప్రమాదంలో తల్లి మృతి చెందగా ఆమె కుమారుడికి గాయాలైన ఘటన జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో జరిగింది. ఎస్సై సత్రం తెలిపిన వివరాల ప్రకారం వికారాబాద్ జిల్లా పరిగి మండలం కాళపూర్ గ్రామానికి చెందిన లక్ష్మమ్మ(55) అనే మహిళ రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు తెలిపారు. గురువారం ఉదయం ఆమె కుమారుడు భీమయ్యతో కలిసి లక్ష్మమ్మ బైక్‌పై షాద్‌నగర్ వెళుతుండగా లాల్‌పహాడ్ వద్దకు రాగానే రోడ్డుపైకి ఓ కుక్క అడ్డు రావడంతో దానికి బైక్ తగలడంతో తల్లీ, కుమారుడు కిందపడిపోయారు. రోడ్డుపై పడడంతో లక్ష్మమ్మ ముఖంపై దెబ్బ తగిలి చెవిలో నుంచి రక్తం కారడంతో అక్కడికక్కడే చనిపోయిందని చెప్పారు. భీమయ్యకు తీవ్ర గాయాలు కావడంతో 108లో చికిత్స నిమిత్తం శంషాబాద్ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. కాగా ఆ కుక్క కూడా చనిపోయింది.

### కారు, బైక్ ఢీ ఒకరికి తీవ్ర గాయాలు



గాయపడ్డ సురేష్‌గౌడ్

కొందుర్గు, మార్చి, 28 : కారు, బైక్ ఢీ కొనడంతో, ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం మండల పరిధిలోని శ్రీరంగాపూర్ శివారులో జరిగింది. స్థానిక హెడ్ కానిస్టేబుల్ శ్రీనయ్య కథనం మేరకు మండల పరిధిలోని విశ్వనాథ్‌పూర్ గ్రామానికి చెందిన ఈడ్గి సురేష్‌గౌడ్ ఉదయం 9 గంటల సమయంలో గ్రామం నుంచి షాద్‌నగర్‌కు బయలుదేరాడు. మార్గమధ్యలో శ్రీరంగాపూర్ శివారులోకి రాగానే షాద్‌నగర్ నుంచి గుర్రంపల్లి వెళుతున్న ఓ కారు ఎదురుగా వచ్చి ఢీ కొంది. దీంతో బైక్‌పై ఉన్న సురేష్‌గౌడ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.. సురేష్‌గౌడ్ మేనమామ లింగంగౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### ఆసుపత్రికి వెళ్లిన.. తల్లి, కుమారుడు అదృశ్యం



మంజుల

కొందుర్గు, మార్చి, 28 : ఆసుపత్రికని వెళ్లిన తల్లి, కుమారుడు కనిపించకుండా పోయిన సంఘటన మండల పరిధిలోని పర్వతాపూర్‌లో జరిగింది. స్థానిక హెడ్ కానిస్టేబుల్ శ్రీనయ్య కథనం ప్రకారం పర్వతాపూర్ గ్రామానికి చెందిన దర్గా నర్సింలుకు 14ఏళ్ల క్రితం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కిషన్‌నగర్ గ్రామానికి చెందిన మంజులతో వివాహం జరిపించారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. నర్సింలు తరుచుగా మద్యం సేవించి భార్యతో గొడవపడేవాడు. తన ఆరోగ్యం బాగా లేదని మంజుల బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ఆమె చిన్న కుమారుడు సందీప్(8)ను తీసుకొని ఆసుపత్రికని షాద్‌నగర్ వెళ్లింది. సాయంత్రం వరకు ఇంటికి తిరిగిరాకపోవడంతో, బంధువుల ఇళ్లలో వెతికినా, వారి ఆచూకి లభించలేదు. గురువారం మంజుల తమ్ముడు అల్వాల శివకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

## దేవాలయం నిర్మాణానికి భారీ విరాళం



విరాళం అందిస్తున్న దాతలు వెంకట్‌రెడ్డి, ఆగిరెడ్డి

చేవెళ్ల, మార్చి 28 : చేవెళ్ల పట్టణ కేంద్రంలో ఉన్న మల్లన్న దేవాలయం నిర్మాణం కోసం చేవెళ్ల పీఏసీఎస్ చైర్మెన్ దేవర వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బండారుశైలజాఆగిరెడ్డి రూ. 30 లక్షలు విరాళం అందించారు. గురువారం ఈ మేరకు చేవెళ్ల మండల కురుమ సంఘం నాయకులు గుత్తి మల్లేష్, గుత్తి శ్రీనివాస్, మహేందర్, దండు సతీష్, మల్లేశ్, బాలయ్య, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్, పలువురు సంఘం నాయకులు విరాళం అందించిన దాతలను ఘనంగా సన్మానించారు. పెద్ద మొత్తంలో దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందించడం సంతోషంగా ఉందని వారు హర్షం వ్యక్తం చేశారు. మరింత మంది దాతలు ముందుకు వచ్చి దేవాలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. ఇప్పటికే దేవాలయం పనులు కొనసాగుతున్నాయని వారు చెప్పారు. కురుమ సంఘం నాయకులు, గ్రామస్థులు ఉన్నారు.

## చెట్లకు నిప్పు పెట్టిన గుర్తుతెలియని దుండగులు



నందివనపర్తిలో కాలిపోయిన చెట్లు

యాచారం, మార్చి 28 : యాచారం మండలంలోని నందివనపర్తి-యాచారం గ్రామాల మధ్య ఉన్న గడ్డికి బుధవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు నిప్పటించారు. దీంతో నాలుగేళ్లుగా ఏపుగా పెరిగిన, హరితహారంలో నాటిన కానుగ చెట్లు కాలిపోయాయి. దాంతో పంచాయతీ అధికారులు ఆందోళన చెందుతున్నారు. వాటి స్థానంలో తిరిగి మొక్కలు నాటడం కోసం చర్యలు తీసుకుంటామని పంచాయతీ అధికారులు చెప్పారు.

# వేసవిలో జీవాలు జాగ్రత్త



మేత కోసం వెళుతున్న జీవాలు

చేవెళ్ల, మార్చి 28 : వేసవిలో జీవాల మేత కోసం వాటి కాపరుల వేట మొదలవుతుంది. వాటికి సరిపాడా మేత దొరికే చోటుకు గొర్లతో పాటు వారు వలస వెళుతుంటారు. ఇలా సుదూర ప్రాంతాలకు వెళుతున్న సమయంలో జీవాలు ప్రమాదాల భారిన పడడమో, వ్యాధులు సోకడమో జరుగుతుంది. అలా జరగకుండా ఉండాలంటే జీవాల కాపరులు పలు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని చేవెళ్ల మండల పశువైద్యురాలు డాక్టర్ శిరీష పలు సూచనలు చేస్తున్నారు. జీవాలను మేపేందుకు ఏ ప్రాంతానికి తీసుకెళ్లాలో కాపరులు ముందుగానే నిర్ణయం తీసుకోవాలి. ఆ ప్రాంతంలో నీటి సదుపాయం, మేత సరిగా లభిస్తుందో లేదో తెలుసుకోవాలి. అక్కడ ఎలాంటి జబ్బులు, వ్యాధులు లేవని తెలుసుకోవాలి. ఇవన్నీ పరిశీలించుకొని నిర్ధారణకు వచ్చాకే జీవాలను ఎంచుకున్న ప్రాంతానికి వలస తీసుకెళ్లాలి. వెళ్లే సందర్భంలో మందను ఒకేసారి ఎక్కువ దూరం నడిపించకూడదు. వాటికి కాస్తంత విశ్రాంతి ఇస్తూ ఉండాలి. గర్భంతో ఉన్న జీవాల విషయంలో మరిన్ని జాగ్రత్తలు పాటించాలి. ఎండ తీవ్రత లేని సమయంలో వాటిని వాహనంలో గాని, నిదానంగానైనా తీసుకెళాలి. రాత్రిపూట గొర్రెలు, మేకలు విశ్రాంతి తీసుకునే సమయంలో మంద చుట్టూ కంప, కంచెను ఏర్పాటు చేయాలి. దీనివల్ల నక్కలు, తోడేళ్లు, దొంగల భారి నుంచి జీవాలను కాపాడుకోవచ్చు. గొర్రెల మందలో కొన్ని మేకలను కూడా ఉంచాలి. వీటివల్ల ఒక్కో సమయంలో గొర్రె పిల్లలకు మేక పాలు తాగించవచ్చు. అంతేకుకుండా నడిచివేళ్లేటప్పుడు మేకలతో కలిసి గొర్రెలు వరుస క్రమంలో వెళ్లే అవకాశం ఉంది.

### తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

వలస వెళ్లే ముందు గొర్రెల శరీరంపై ఉన్న ఉన్నిని కత్తిరించాలి. వెళ్లే ప్రాంతంలో జీవాలకు వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. కాబట్టి వాటికి ముందు జాగ్రత్త టీకాలు వేయించాలి. నట్టల నివారణ మందు తప్పని సరిగా తాపించాలి. దీనివల్ల కొత్త ప్రదేశాల్లో నీరు, మేత ద్వారా సోకే పరాన్న జీవుల బెడద నుంచి మూగజీవాలను కాపాడుకోవచ్చు. వలస వెళ్లినప్పుడు జీవాలకు అంటు వ్యాధులు సోకితే వెంటనే దగ్గరలోని పశువైద్యులను సంప్రదించి వైద్య చేయించాలి. వలస వెళ్లినప్పుడు కొన్ని రోజులు అక్కడే ఉండాల్సివస్తుంది. కాబట్టి ఆ సమయాల్లో గ్రామీణ,సంచార పశువైద్య కేంద్రాలకు వెళ్లి వైద్యులను అడిగి టీకాలు వేయించాలి. ఈ చర్యలు చేపడితే వేసవిలో జీవాలు రోగాల భారిన పడకుండా కాపాడుకోవచ్చు.

### బీమా చేయించాలి

వలస వెళ్లిన సమయంలో దొంగలు, క్రూరమృగాల దాడుల వల్ల జీవాలు చనిపోతే జీవాల కాపర్లు ఆర్థికంగా నష్టపోయే ప్రమదం ఉంది. కావున ముందస్తుగానే జీవాలకు బీమా చేయిస్తే ఆ నష్టాల నుంచి త్వరగా గట్టెక్కవచ్చు. గొర్రెల కాపరులు మూగజీవాల బీమా వివరాల కోసం పశువైద్యులను సంప్రదించాలి.

# నిధులు లేక సతమతం

● హామీలు అమలు చేయలేని దుస్థితి

● కేటాయించాలని ఎంపీటీసీల వేడుకోలు



చేవెళ్ల మండల పరిషత్ కార్యాలయం

చేవెళ్ల, మార్చి 28 : ఎంపీటీసీలుగా గెలిచిన సంతోషం పదవీ కాలం గడిచేకొద్ది ఉండటం లేదు. ఎన్నికల్లో గెలిచేందుకు లక్షల్లో ఖర్చు పెట్టినా ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో ఏం చేయాలో తెలియక పలువురు ఎంపీటీసీలు సతమతం అవుతున్నారు. ప్రజల ఓట్లతో గెలిచినా తమకు కనీస గౌరవం లేకుండా పోతోందని, గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌ల్లో తమకు సీటు, గది కూడా ఉండదని పలువురు ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము గెలిచిన ఐదేళ్లు కావస్తోందని, ప్రభుత్వం నుంచి ఎటువంటి నిధులు మంజూరు చేయకపోవడంతో తమకు ఓటువేసి గెలిపించిన ప్రజలకు సమాధానం చెప్పలేక, అభివృద్ధి పనులు చేయలేక ఇబ్బందిపడుతున్నారు.

**మండలంలో 17 మంది ఎంపీటీసీలు**

చేవెళ్ల మండలంలో 37 గ్రామ పంచాయతీలు ఉండగా 17 మంది ఎంపీటీసీలు ఉన్నారు. 2019 మేలో ఎన్నికలు జరగగా జూన్ 7న వారు ప్రమాణ స్వీకారం చేశారు. అప్పటి నుంచి గత ప్రస్తుత ప్రభుత్వం కూడా నిధులు విడుదల చేయలేదు. అప్పుడప్పుడు విడుదలవుతున్న జిల్లా పరిషత్ నిధులతో పలువురు ఎంపీటీసీలు అరకొర పనులు చేపట్టారు. ప్రతీ మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశంలో ఇచ్చే ఛాయ్, బిస్కెట్ల కోసమే తాము హాజరవుతున్నట్లుందని పలువురు ఎంపీటీసీలు ఎద్దేవా చేస్తున్నారు. సమావేశాల్లో తాము ప్రజా సమస్యలపై చర్చ లేవనెత్తినా వాటిని పట్టించుకునే వారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు ఇచ్చే గౌరవ వేతనం కూడా సక్రమంగా అందడం లేదని వాపోతున్నారు. ఈ మూడున్నర నెలల కాలంలోనైనా ప్రభుత్వం తమకు నిధులు కేటాయిస్తే గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయిస్తామని, తద్వారా గ్రామాల్లో కనీస గౌరవం అయినా ఉంటుందని వారు ఆశిస్తున్నారు.

**అభివృద్ధిలో భాగస్వాములను చేయాలి**



ప్రత్యేక అధికారుల పాలనలోనైనా అభివృద్ధి పనుల్లో తాము భాగస్వాములం అయ్యేవిధంగా ప్రభుత్వం అధికారికంగా ప్రకటిస్తే బాగుంటుంది. మాకంటూ ఎలాంటి నిధులు పనులు లేకపోవడంతో గ్రామాల్లో తలెత్తుకోలేని పరిస్థితి ఉంది. కొత్త ప్రభుత్వంలోనైనా నిధులు కేటాయించి ఎంపీటీసీలను గుర్తించాలి.

- వడ్ల సత్యనారాయణచారి, ఎంపీటీసీ అల్లావాడ